


# బ్లాక్ స్పాట్

సత్యనారాయణమూర్తి

క్లాక్ టవర్‌లోని గడియారపు ముళ్లు కాలరాక్షసుడి యెగుడు దిగుడు చేతుల్లా వున్నాయ్.

టైం ఏడూనలభై ఐదయింది.

'సన్‌రైజ్ ఇంటర్నేషనల్' 'ఇన్' గేట్లోంచి సరోజ కారు చర్రున దూసుకొచ్చి పార్కింక్ ప్లేస్‌లో ఆగింది. కార్, లాక్ చేసి తాళాలు వేనిటీ బ్యాగ్‌లో పడేసుకుంటూ రిసెప్షన్‌లోకి నడిచింది సరోజ.

రూం నెంబర్—థౌజండ్ అండ్ ఫోర్—

ట్రింగ్.... ట్రింగ్....

తలుపు తెరుచుకుంది.

"వెల్‌కం.... వె ల్ క ం....! వె ల్ క ం! సరోజా!",

రమేష్ స్వాగతం సరోజని గిలిగింతలు పెట్టింది.

మృదువుగా, సుతారంగా ఆమె ఎడమ చేయి పట్టుకుని సోఫా దగ్గరికి నడిపించాడు.

"ఎక్స్‌క్యూజ్ మీ .... జస్టే మి ని ట్" సరోజని సోఫాలో కూచోబెట్టి రమేష్ ఏంటి రూంలోకి వెళ్ళాడు.

సరోజ వేనిటీబ్యాగ్ తెరిచి, దాని మూతకి అమర్చి వున్న అద్దంలో, మొహం చూసుకుంటూ, కర్చీఫ్‌తో నొసటిమీది చిరుచెమట అద్దుకుంటోంది. ఆ రోజునే 'సెట్' చేయించుకున్న హెయిర్ స్టెయిల్ చెక్కు చెదరలేదని నిర్ధారణ కొచ్చింది.

'ట్రిం' చేయించుకున్న కనుబొమ్మలు బోర్లించిన నెలవంకల్లా వున్నాయని రూఢి చేసుకుంది.

చెంపల మీద 'చీక్‌రెడ్' పల్చగా పులిమింది. బ్యాగ్ మూసేసి టీపాయ్‌మీద పెడుతూంటే ట్రే—ట్రేలో స్నాక్స్ — ఐస్ పెయిల్, గ్లాసులూ తెచ్చి టీపాయ్ మీద అమర్చాడు రమేష్.

మళ్ళీ లోపలికి వెళ్ళి బాటిల్స్‌తో తిరిగి వచ్చాడు. సరోజకు ఎదురుగా సోఫాలో కూర్చుని గ్లాసులు నింపాడు.

"కమాన్ సరోజా! లెట్స్ సెలెబ్రేట్" రమేష్ తన గ్లాసు చేతిలోకి తీసుకున్నాడు.

"థేంక్స్" సరోజ కూడా తన గ్లాసు........

"ఛీయర్స్" మూరెడు పొడుగున్న రెండు గ్లాసులు 'ఢీ'.

సరోజ బీరు తాగుతోంది.

రమేష్ విస్కీ....


సరోజ బీరులో నురుగూ, చేదూ వొగరూ వున్నాయి.

రమేష్ విస్కీలో పొగరూ.... ఘాటూ....

"బ్యూటిఫుల్.... చార్మింగ్.... క్యూట్...." రమేష్ సరోజ అందచందాల్ని పొగిడాడు.

"మ్యాన్లీ.... హేండ్‌సం.... స్మార్టు" సరోజ రమేష్‌లోని ఆకర్షణను వర్ణించింది. గ్లాసులు ఖాళీ అయ్యాయ్.

రమేష్ తన సోఫాలోంచి డబుల్ సోఫాలోకి మారాడు.... సరోజ కూడా ఆ సోఫాలోకి చేరింది.



నెక్స్ట్ రౌండ్....

* * *

ఊరు చివర కొత్తగా బలిసిన కోలనీ వెన్ను మీద వేసిన రాచపుండులా వుంది. ఆ పుండుకు అందమైన బ్యాండేజి కట్టినట్లు అక్కడి ఇళ్ళన్నీ ఆధునికంగానూ, అదునాతనంగానూ వుంటంతో కాలనీమాత్రం బోల్డంత గ్లామరస్‌గా కనిపిస్తూంది!

డాబూ, దర్వాజలతో ఎగిసిన ఫ్రంట్ ఎలెవేషన్‌లన్నీ—ఒక్కొక్కటీ ఒక్కో జాతి త్రాచులా వున్నాయ్.

సర్వెంట్స్ క్వార్టర్స్ పేరున ప్రతి కాంపౌండులోనూ ఏదో మూలన వున్న ఒకటీ—రెండూ గదులు పుండుమీద వాలే ఈగల్లా వున్నై.

రాజారావుది లంకంత బంగళా. అద్దాల మేడ. రాజారావు గొప్ప వ్యాపారవేత్త. వ్యవహారికుడు. తాగుబోతు. తిరుగుబోతు.

అతనికి ఇద్దరు కొడుకులు. వారిద్దరూ ఈ లంకంత బంగళాలో వుండరు. కొడై కెనాల్‌లో చదువుకుంటున్నారు. ఇక్కడ వుండేది అతనూ అతని భార్యా.

బంగళా పై అంతస్థులో డ్రస్సింగు టేబిల్ ముందు జార్జెట్ చీరా, దానిమీదకి 'మేచ్' అయే జాకెట్టూ వేసుకుని అద్దంలో తన రూప లావణ్యాలను చోద్యంగా చూసుకుంటోంది రత్నం.

బంగళాలోకి కారొచ్చి ఆగిన అలికిడికి రత్నం బెంబేలుపడి కిటికీ దగ్గరికి పరిగెత్తింది. కార్లోంచి దిగుతున్న రాజారావుని చూసి వుక్కిరి బిక్కిరయింది. ఆమెకు భయమేసింది గాభరా పుట్టింది....ఏం చేయడానికీ పాలుపోలేదు.

ఎలాగోలాగ మెట్లు దిగిపోతే రాజారావు కన్ను గప్పి బైటపడొచ్చు.

"కానీ....ఎలా?"

"ఇప్పుడాయన తిన్నగా పైకొచ్చేస్తే...."

"అయ్య బాబోయ్! ఇంకేమన్నా వుందా?"

మెట్లమీద బూట్ల టక టక... క్రమేపీ దగ్గరవుతోంది.

రత్నానికి ముచ్చెమటలు పోశాయ్. కాలూ చెయ్యీ ఆడలేదు.

చటుక్కున వెళ్ళి బీరువా పక్కన దాక్కుంది....ఆ ఖంగారులో మంచాల పక్కన టీపాయ్ మీది మంచినీళ్ళ గ్లాసు కింద పడేసింది. గ్లాసు కిందపడి పగిలిన చప్పుడు రత్నాన్ని మరింత కలవర పెట్టింది.

వెనక్కి తిరిగి చూడ్డానిగ్గానీ, మరెందుకూ గానీ వ్యవధి లేదు.

బీరువా పక్కకి చేరి గట్టిగా ఊపిరి పీల్చుకుని "అమ్మయ్య" అనుకోకుండానే రాజారావు గదిలోకి వచ్చేశాడు.

టై విప్పి కోటు జేబులో పెట్టాడు. కోటు తీసేసి వార్డ్రోబ్‌లో తగిలించాడు. మంచం మీద కూచుని షూ లేసులూ, షూ సాక్సూ విప్పేశాడు. మంచం మీద వెనక్కి వాలిపోతూ గట్టిగా ఆవులించాడు.

"డాళింగ్....డాళింగ్" దొరలాగ పిల్చాడు పెళ్ళాన్ని.

ఆ పిలుపుకు బీరువా వారనున్న రత్నం గిలగిల్లాడిపోయింది.

రాజారావు కొంతసేపు మంచంమీద అలా పడుకుని ఏదో జ్ఞాపకమొచ్చి లేచాడు.

డ్రెస్సింగ్ టెబుల్ దగ్గరకెళ్ళి తల దువ్వుకున్నాడు.

చొక్కా విప్పేసి మంచం మీదకి గిరవాటేశాడు. బీరువా దగ్గరకెళ్ళి గ్లాస్కో పంచా, లాల్చీ తీశాడు... బట్టలు మార్చుకున్నాడు. డ్రెస్సింగ్ టేబుల్ దగ్గరికి వచ్చి లాల్చీమీద సెంట్ స్ప్రే చేసుకున్నాడు.


రాజారావుకి అద్దంలో బీరువా చాటున చీర కొంగు కనబడింది....బీరువా దగ్గరికి పిల్లిలాగ నడిచాడు.

కొంగు పట్టుకుని ఒక్క లాగు లాగాడు.

కెవ్వున కేక.

"నేను....రత్నాన్నండీ...."

"....ఊఁ....రత్తివా?!" రాజారావు ఆమెను గుచ్చి గుచ్చి చూశాడు.




"....ఏంటీ?.... ఇవేళ ఇంత అందంగా ముస్తాబయ్యావ్?....కళ్ళు చెదిరిపోతున్నాయ్."

"అమ్మగారితో అదేదో కొట్టుకెళ్ళానండి. ఆడ తల దువ్వి జడేసి, కనుబొమ్మలూ అవీ దిద్ది....బుగ్గకింద ఈ సుక్కెట్టారయ్యా...."

"చక్కన్చుక్కలా గున్నావ్....ఇప్పుడు నీ ముందు అమ్మగారు దిగదుడుపే:...." పొగ డాలనే పొగిడి రాజారావు ఆమెను వాటేసు కున్నాడు.

"అయ్యగారూ.... నన్నొదిలేండి.... అమ్మ గారొచ్చే ఏలయింది....అయ్‌గారూ అమ్మగారి జార్జెట్ కోక నలిగిపోతోంది....నన్నొదిలేండి. మీరు పెద్దోళ్ళు.... నన్నొదిలేండి బాబూ.... మీకు దణ్ణం పెడతా."

రాజారావు రత్నాన్ని వదల్లేదు.

రత్నం లబో దిబో మంటోంది.

అద్దాల మేడ ఏ చడీ చప్పుడూ బయటకి పొక్కనివ్వడం లేదు.

రత్నంలో సత్తువ సన్నగిల్లుతోంది.... అలిసిపోతోంది....

శక్తినంతా కూడదీసుకుని రాజారావుని ఒక్క తోపు తోసింది రత్నం.

వెళ్ళి మంచంమీద పడి బంతిలాగ తిరి గొచ్చి పారిపోతున్న రత్నాన్ని పొదివి పట్టు కున్నాడు, రాజారావు.

నవ్వుతున్నాడు....అతని కళ్ళల్లో కైపూ, కసీ, కామం—

"రాజారావు ఇంటి యజమాని. తను అత నింట్లో నౌఖరు" అన్న వాస్తవం రత్నంలో ఇప్పుడు ఏ కోశానా లేదు.

'రాజారావు ఒక నీతిమాలిన మగాడు. తనొక ఆడది. అతనంటే యిష్టం లేని ఆడది. గుడ్డికామంతో, పశుబలంతో తన మీద పడ్డ అతణ్ని ప్రతిఘటించాలి. లొంగకూడదు.'

రత్నం రాజారావు చెయ్యి కదిలించింది. గుండెల మీద బాదింది. అందిన చోటల్లా గోళ్ళతో గీరింది....రక్కింది. చేతుల్తో కొట్టింది. తలతో కుమ్మింది.

ఎదురు తిరిగిన రత్నం మీద రాజారావుకి అరికాలిమంట తల కెక్కింది.

లాగి చెంపపెట్టు పెట్టాడు.

రత్నం వెళ్ళి మంచం పక్క టీపాయ్‌మీద పడింది. కాల్లో గాజుపెంకు గుచ్చుకుంది. ఐనా

లక్ష్యపెట్టలేదు....రాజారావు తనవైపే వస్తున్నాడు. నేలమీద చెయ్యి ఆనించి లేవబోయింది....లేచింది.

గణ గణా ఫోను....

చికాగ్గానే వెళ్ళి ఫోను తీసి "హలో" అన్నాడు రాజారావు.

"నేను .... సరోజనండీ.... అనుకోకుండా రమేష్ కలిశాడు. అతనితో మాట్లాడాను. వాళ్ళ కంపెనీ ప్రోడక్ట్స్ సోల్‌డిస్ట్రిబ్యూషన్ మన కన్‌సెర్న్‌కే ఇప్పిస్తానని ప్రోమిస్ చేశాడు. కాని....వన్ లాక్ డిపాజిట్ కట్టాలిట."

"వన్ ల్యాక్ ఏవిఁటిః టూ లాక్స్ డిపాజిట్ కట్టినా నష్టం లేదు."

"అదేః ఇంకా మాట్లాడాలి....తొమ్మిదవుతోంది. నేను రావడం లేటు కావచ్చు...."

గోడ వారగా నక్కుతూ నక్కుతూ గుమ్మం వైపు దారి తీస్తున్న రత్నాన్ని చూసి—

"ఆగు" గాండ్రించాడు రాజారావు.

ఉలిక్కిపడి ఆగిపోయింది రత్నం.

"ఎవరదిః" అటునుంచి సరోజ ఆరా.

"ఆఁ....అదా.... రత్నం...." నాలుకక్కరుచుకున్నాడు రాజారావు.

"అదిప్పుడు మేడమీద బెడ్‌రూంలో ఎందుకుందిః" సరోజ కూపీ.

"ఏం లేదు సరోజా....నువ్వు మాత్రం రమేష్‌తో డీల్ పక్కా చేసుకునిరా...."

"ఇంత రాత్రివేళ రత్నం బెడ్‌రూంలో ఎందుకుందీ అని అడుగుతూంటే మాట మారుస్తారేంః" సరోజ వదిలిపెట్లేదు.

"నువ్వు....ఏ రత్నం అనుకొంటున్నావ్ః"

"అనుకోవడ మేవిఁటిః పనిమనిషి నాగరత్నం అంటున్నాను."

"ఛ....ఛ....నో....నో....నాతో మాట్లాడుతోంది రత్నం ఎంటర్‌ప్రైజెస్ ప్రొప్రయిటర్ వెంకటరత్నంగారు...." రాజారావు ప్లేటు ఫిరాయించబోయాడు.

"ఒహో....ఆయనాః ఓసారి ఫోన్ దగ్గరికి పిలవండి. ఆయనతో మాట్లాడాలి."

కంగు తిన్నాడు రాజారావు. అరచేత్తో ఫోన్ మౌత్‌పీస్ మూసిపెట్టి గదంతా కలయ చూశాడు.

రత్నం డ్రెస్సింగ్ టేబుల్ దగ్గర నిలబడుంది. డ్రెస్సింగ్ టేబుల్ అద్దంలో తన రూపం తనకే ఎంతో వికృతంగా కనిపిస్తోంది. సెట్ చేసిన హెయిర్ స్టైయిలు అసహ్యమేస్తోంది. గీతల్లా గీసిన కనుబొమ్మలు అసహజమైన వాతల్లా వున్నాయి.

బ్యూటీ క్లినిక్‌వాళ్ళు పెట్టిన బ్యూటీస్పాట్ "నువ్వెంతః నీ బతుకెంతః లేనిపోని అందచందాలు కావాల్సి వచ్చాయేం నీకుః" అని వెక్కిరించసాగింది.

రత్నంలో ఏదో వెగటు భావం....అద్దం మీదనించి చూపులు మళ్ళించేసింది.

తనకీ రాజారావుకీ, తనకీ గది గుమ్మానికీ మధ్య వున్న దూరాన్నీ, రాజారావుకు అందకుండా—ఎంత వేగంగా అవతలకి చేరాల్సిందీ అంచనా వేస్తోంది.

"స....రోజా.... వెంకటరత్నంగారు బాత్‌రూమ్‌లోకి వెళ్ళారు.... ఐనా.... నే చెబుతున్నాగాః నమ్మకం లేదూః.... ఋజువులూ, సాక్ష్యాలూ కావాలాః.... ఇంతకీ నువ్వెక్కణ్ణించి మాట్లాడుతున్నావ్ః"

సరోజ ఠక్కున ఫోను పెట్టేసింది.

"సరోజా....సరోజా...." రాజారావు కూడా ఫోను పెట్టేశాడు విసుగ్గా.

వెనుతిరిగి రత్నం కోసం చూశాడు. బెడ్‌రూమ్ బైట గడియపెట్టిన శబ్దం వినిపించిందే కానీ రత్నం కనబళ్ళేదు.

తలుపులన్నీ బిడాయించిన గదిలో తరుముకొస్తున్న పిల్లి బారినుండి ఎలుక, నీళ్ళుపోయే కన్నంలోంచి బ్రతుకుజీవుడా అని జారుకుంటే గదిలో బందీ అయిపోయిన పిల్లి మోస్తరైంది రాజారావు పరిస్థితి.